సాక్షి
అనంతపురం

బుధవారం । 27 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.25 పలికింది. కనిష్ఠం రూ.20. సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

35.6°/21.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

విఘ్నేశ్వరుడు ప్రతి ఇంటా సంతోషం నింపాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



అనంతపురం కార్పొరేషన్: వినాయక చవితిని అందరూ సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజల విఘ్నాలు తొలగి కుటుంబాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, విజయాలు సిద్ధించాలన్నారు. పర్యావరణ హితంగా వినాయక చవితి ఉత్సవాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కోరారు.

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. గణనాథుని కరుణా కటాక్షాలతో జిల్లా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని పేర్కొన్నారు.

మట్టి గణపతులే శ్రేష్టం

అనంతపురం కల్చరల్: పర్యావరణానికి హితం కల్గించే మట్టి గణపతులనే పూజల్లో వాడాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక రామ్‌నగర్‌లోని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వాడకంతో పర్యావరణం దారుణంగా దెబ్బతింటుందన్నారు. పీఓపీతో చేసిన విగ్రహాలను వినియోగించరాదన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పీసీబీ ఇంజినీర్ మునిప్రసాద్, తహసీల్దార్ హరి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ జగదీష్



అనంతపురం సెంట్రల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు ఎస్పీ పి. జగదీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మందుగుండు సామగ్రి ఉంచరాదని సూచించారు. చిన్నారులకు అందేలా వైర్లను ఏర్పాటు చేయరాదన్నారు. నిర్వహణ కమిటీ ప్రతినిధులు విధిగా కాపలా ఉండాలన్నారు. అర్ధరాత్రి వరకూ కాకుండా పగటి సమయంలో నిమజ్జనం జరుపుకోవాలని కోరారు. చిన్నారులను వెంట తీసుకెళ్లరాదన్నారు.

రేపు ఈపీఎఫ్‌ఓ సేవలపై అవగాహన

అనంతపురం సిటీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) వినియోగదారులకు అవగాహన కల్పించే నిమిత్తం ఈ నెల 28న 'నిధి ఆప్కే నికట్ 2.0' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కడప రీజినల్ పీఎఫ్ కమిషనర్–1 కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 27న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని 28వ తేదీకి కార్యక్రమాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. తాడిపత్రి మండలం భోగసముద్రం వద్ద ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు కొత్తగా కవర్ అయిన సంస్థల ప్రతినిధులకు ఓరియంటేషన్ ఉంటుందన్నారు. 11 నుంచి 11.30 వరకు యజమానులు, కాంట్రాక్టర్లతో ఆన్‌లైన్ సేవలు,చందాదారులు /పెన్షనర్ల కోసం ఆన్‌లైన్ సేవలు, మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కొత్త కార్యక్రమాలు, సంస్కరణలపై అవగాహన, 2 నుంచి 2.30 వరకు మినహాయింపు పొందిన సంస్థలతో ముఖాముఖి ఉంటుంది.



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో విద్యుద్దీపాలంకరణలో వినాయక మండపం

విఘ్న నాయకా..
వేడుకే ఇక

విఘ్నాలను తొలగించేవాడు.. తొండంతో దీవించేవాడు.. సకల శుభాలను చేకూర్చే వాడైన బొజ్జ గణపయ్య పండుగకు సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. సుందరంగా ముస్తాబు చేసిన మండపాల్లో బుధవారం విఘ్న నాయకుడు కొలువుదీరనున్నాడు. విశేష పూజలు అందుకోనున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పండుగ సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. మామిడాకులు, చెరకు గడలు, వెలక్కాయలు, పండ్లు, పూల కొనుగోళ్లకు జనం ఉత్సాహం చూపారు. జై జై గణేశా అంటూ బొజ్జ గణపయ్యల ప్రతిమలను యువకులు తీసుకెళ్లారు. కొన్ని చోట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పండుగ సామగ్రి కొనుగోలుదారులతో మంగళవారం సందడిగా మారిన అనంతపురం టవర్‌క్లాక్ ప్రాంతం



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

దొరికేనా ఆ బంగారం?

- సవాలుగా మారిన హిందూపురం బ్యాంకు దోపిడీ కేసు
- ఇటీవల ఒక దొంగ అరెస్టు
- రెండు కేజీల బంగారం రికవరీ
- లభించని మరో నిందితుడి ఆనవాళ్లు
- అతని వద్దే తొమ్మిదిన్నర కిలోల బంగారం



చోరీ జరిగిన హిందూపురం ఎస్‌బీఐ ఎదుట ఆందోళనలో ఖాతాదారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని ఎస్‌బీఐ (స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో దోపిడీ జరిగి రేపటికి సరిగ్గా నెల రోజులవుతోంది. ఎక్కడా ఆనవాళ్లు కూడా లభించకుండా పదకొండున్నర కిలోల బంగారం, రూ.30 లక్షల నగదును దుండగులు దోచుకెళ్లడం అప్పట్లో ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన నుంచి ఇప్పటికీ స్థానికులు తేరుకోలేకపోతున్నారు. చోరీ అయిన బంగారం మొత్తం రైతులు, వివిధ వర్గాలు తనఖా పెట్టిందని తెలిసింది. ఘటనాస్థలిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమికంగా లభించిన ఆధారాల మేరకు బిహార్ లేదా ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొంగలు చేసిన పనిగా గుర్తించారు.

ఒక నిందితుడు చిక్కినా..

కేసు ఛేదనకు తీవ్రంగా శ్రమిస్తున్న పోలీసులకు నాలుగు రోజుల క్రితం ఒక దొంగ దొరికాడు. అతని నుంచి 2 కేజీల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు. కేసులో ఇది కొద్దిగా ఉపశమనం కలిగించే విషయమే అయినా మిగతా తొమ్మిదిన్నర కేజీల బంగారం ఎక్కడుందో తెలియకపోవడమే ఆందోళన కలిగిస్తోంది. దీనికి తోడు పట్టుబడిన దొంగకు బ్యాంకు దోపిడీలో వాటా చాలా చిన్నదని వెల్లడైనట్లు తెలిసింది. దీంతో అసలు దొంగ కోసం పోలీసులు మళ్లీ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన ఆరు బృందాలు రంగంలోకి దిగాయి. మధ్యప్రదేశ్, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలతో పాటు అనుమానం వచ్చిన ప్రతిచోటా లాడ్జీలు, హోటళ్లలో జల్లెడ పడుతున్నాయి.

చిన్న క్లూ కూడా లేదు

శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు..ముఖ్యమైన దొంగకి సంబంధించి చిన్న ఆధారం కూడా లభించడం లేదు. అపహరించిన బంగారాన్ని ఇప్పటికే ముంబై లేదా బెంగళూరు ప్రాంతాల్లో విక్రయించి ఉంటారని భావిస్తున్నారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానం వాడి బ్యాంకు తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించడం.. ఎక్కడా వేలిముద్రలు, పాద ముద్రలు పడకుండా జాగ్రత్త పడడం.. అసలు ఫోనే వాడకపోవడం.. ఎలాంటి వాహనాన్ని వినియోగించకపోవడంతో అతడిని పట్టుకోవడం కత్తిమీద సాములా మారింది.

ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద దోపిడీ

హిందూపురం బ్యాంకు దోపిడీ కేసును ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతిపెద్ద దోపిడీ కేసుగా పోలీసులు చెబుతున్నారు. అనంతపురం నగర శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఇటీవల జరిగిన దొంగతనం సొత్తు విలువ రూ.3 కోట్లే. కానీ హిందూపురం బ్యాంకు దోపిడీ కేసులో బంగారం, నగదు విలువ కలిపి రూ.12 కోట్ల వరకూ ఉంటుంది.

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మొత్తం 7 దుకాణాలపై దాడులు నిర్వహించారు. రూ. 3.53 లక్షల విలువ చేసే ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా విజిలెన్స్ ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ప్రసాద్ హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, ఎస్‌ఐ గోపాలుడు పాల్గొన్నారు.

కలెక్టర్ పేరిట ఫేక్ ఫేస్‌బుక్ ఐడీ

అనంతపురం అర్బన్: 'డిస్ట్రిక్ట్ కలెక్టర్ అనంతపురం' అంటూ తన పేరిట ఎవరో ఫేక్ ఫేస్‌బుక్ ఐడీ క్రియేట్ చేశారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు, తన శ్రేయోభిలాషులకు ఫేక్ ఐడీతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తున్నారని, ఈ విషయాన్ని అందరూ గమనించి సైబర్ నేరాలపై అప్రమత్తతతో ఉండాలని ఆయన సూచించారు.

పింఛన్లు పునరుద్ధరించాల్సిందే

శింగనమల: కుట్రపూరితంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాల్సిందేనని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. లేకుంటే దివ్యాంగులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వీరాంజనేయులుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ధర్నాకు వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు తరిమెల నారాయణ మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో దాదాపు 4 వేల మంది దివ్యాంగులకు నోటీసులు అందజేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక నేడు కుట్రలకు తెరలేపారన్నారు. దివ్యాంగులకు అందజేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నడవలేని వారు, బుద్ధిమాంద్యం వారికీ నోటీసులివ్వడం దారుణమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబరు 1న ఒక్క దివ్యాంగుడి పింఛన్ తొలగించినట్లు ప్రకటించినా ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, మండల కో–ఆప్షన్ మెంబరు అలీ బాషా, సర్పంచ్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, గొల్లారెడ్డి, నూరు మహమ్మద్, వెంకటరమణ, శ్రీనివాసులు, విజయ్, మల్లికార్జునరెడ్డి, జగన్, కోటిరెడ్డి, వెంకటప్ప, నాగముని, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేటీఎం లోపభూయిష్ట సేవలపై కొరడా

అనంతపురం సెంట్రల్: పేటీఎం కంపెనీ లోపభూయిష్ట విధానాలపై అనంతపురం వినియోగదారుల కమిషన్ కొరడా ఝుళిపించింది. సదరు కంపెనీకి ఓ కేసులో జరిమానా విధించింది. శింగనమల మండలానికి చెందిన తస్వీర్‌బాషా 2023 ఫిబ్రవరి 27న పేటీఎం సౌండ్‌బాక్స్ కొనుగోలు చేశాడు. తర్వాత కొన్ని రోజులకి పేటీఎం సేవలను డీ యాక్టివేట్ చేయమని అభ్యర్థించినా పట్టించుకోలేదు. ఇదే క్రమంలో తస్వీర్ బాషా అనుమతి లేకుండా ఆయన ఖాతా నుంచి రూ.2,480ను కంపెనీ కట్ చేసుకుంది. బాధితుడు పలుమార్లు కంపెనీ కస్టమర్ కేర్, గ్రీవెన్స్ సెల్‌ను సంప్రదించినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యురాలు డి. గ్రేస్‌మేరీ మంగళవారం తీర్పు వెలువరించారు. కంపెనీ నిర్లక్ష్యం, లోపభూయిష్టమైన విధానాలు ఉన్నట్లు తేలడంతో బాధితుని ఖాతా నుంచి కట్ చేసిన మొత్తాన్ని 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించారు. అలాగే వినియోగదారుడు ఎదుర్కొన్న మానసిక వేదనకు పరిహారంగా రూ.20 వేలు, న్యాయపరమైన వ్యయాల కోసం రూ.5 వేలు 45 రోజుల్లోపు చెల్లించాలని స్పష్టం చేశారు. ఆలస్యమైతే 12 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజల జీవనాన్ని సులభతరం చేసేలా టెక్నాలజీ ఉండాలి కానీ పేటీఎం లాంటి యాప్‌లు అన్యాయంగా చార్జీలు వసూలు చేస్తూ సమాజానికి భారంగా మారుతున్నాయని, ఇలాంటి వాటిని నిలువరించాల్సి ఉందని కమిషన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

మాఫియా డాన్‌ల ఉలికిపాటు

- బియ్యం అక్రమ రవాణాకు తాత్కాలిక బ్రేక్



గుంతకల్లులో పట్టుబడిన బియ్యం బస్తాలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రేషన్ బియ్యం మాఫియా డాన్‌లు ఉలిక్కిపడ్డారు. ఈనెల 21న సాక్షిలో 'మాఫియా గుప్పిట్లో రేషన్' శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఒక్కసారిగా బియ్యం మాఫియా డాన్‌లు అప్రమత్తమయ్యారు. చిన్న చిన్న సరఫరాదారులందరూ కలుగుల్లోకి వెళ్లినట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున మీడియాలో కథనాలు రాలేదని, అందరూ కొన్ని రోజుల పాటు సైలెంట్‌గా ఉండాలని డాన్‌ల నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బియ్యం సేకరించి గోడౌన్‌లకు చేర్చే ఏజెంట్ల మధ్య అనైక్యత కారణంగానే మీడియాకు సమాచారం వెళ్లిందని మాఫియా డాన్‌లు మండిపడ్డారు. 'మీ మధ్య ఉన్న వివాదాల కారణంగా సమాచారం బయటకు వెళుతోంది. జాగ్రత్తగా లేకపోతే మనకు తీవ్ర నష్టం జరుగుతుంది' అంటూ హెచ్చరించారు. సేకరించిన బియ్యాన్ని ఏజెంట్ల దగ్గరే మరికొన్ని రోజులు ఉంచుకోవాలని సూచించారు.

ఇకపై సోమందేపల్లికే రండి..

శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లి కేంద్రంగా బియ్యం మాఫియా నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే డంప్‌లు మాత్రం అన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. ఇకపై డంప్‌లకు కాకుండా నేరుగా సోమందేపల్లికి రేషన్ బియ్యం తీసుకురావాలని మాఫియా డాన్ సరఫరాదారులకు చెప్పాడు. వాహనాలు డంప్‌ల వద్దకు పంపలేనని, సోమందేపల్లి నుంచి అయితే బంగారుపేట, పావగడకు సులభంగా రవాణా చేసుకోవచ్చనేది ఆలోచనగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇటీవల బియ్యం అక్రమ రవాణాకు తాత్కాలిక బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. మాఫియా డాన్‌గా చెప్పుకుంటున్న ఆర్కే నుంచి మళ్లీ ఆదేశాలు రాగానే రవాణా సాగిస్తామంటున్నారు. కాగా.. బియ్యం అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నా పోలీసులు, విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం గమనార్హం.

వారం రోజులు డంప్‌ల జోలికి వెళ్లొద్దు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉంచిన బియ్యం డంప్‌ల జోలికి వెళ్లద్దని మాఫియా భాగస్వాములు అందరూ నిర్ణయించినట్టు తెలిసింది. నాలుగైదు రోజులు పోలీసులు, విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులతో సమావేశం నిర్వహించుకుని, తర్వాత సరఫరా చేయాలనేది ప్రధాన ఉద్దేశంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే చెక్‌పోస్టుల అధికారులతోనూ, విజిలెన్స్ వారితోనూ టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం.

యూరియా.. రాదేమయా..

- తాజాగా జిల్లాకు మరో 2,200 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్
- అదిగో ఇదిగో అంటున్నా రాని యూరియా
- రైతులకు తప్పని ఇబ్బందులు



అనంతపురం అగ్రికల్చర్: యూరియా సరఫరా ఆలస్యమవుతోంది. సోమవారం ఇఫ్కో కంపెనీ నుంచి 1,022 మెట్రిక్ టన్నుల డీఏపీతో పాటు 20–20–0–13 రకం కాంప్లెక్స్ వచ్చింది. ఇక మంగళవారం కూడా కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ నుంచి 2,200 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సులు జిల్లాకు చేరాయి. అందులో 14–34–14 రకం 1,100 మెట్రిక్ టన్నులు కాగా 20–20–0–13 రకం 1,100 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. అవసరం లేని 'కాంప్లెక్స్' జిల్లాకు చేరుతుండగా... రైతుల నుంచి డిమాండ్ ఉన్న యూరియా మాత్రం ఒక బస్తా కూడా సరఫరా కావడం లేదు. ఇప్పటికే జిల్లా అంతటా యూరియా నిల్వలు దాదాపు ఖాళీ అయ్యాయి. కేవలం మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 700 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నా దాన్ని బయటకు తీయడం లేదు. జిల్లా వ్యవసాయశాఖ ఇండెంట్ పెట్టకుండా ఆలస్యం చేస్తుండటంతో బఫర్‌స్టాక్ అలాగే ఉండిపోయినట్లు చెబుతున్నారు. ఇదే క్రమంలో స్పిక్ కంపెనీ నుంచి వస్తుందనుకున్న యూరియా రావడం ఇంకా ఆలస్యం కావొచ్చని చెబుతున్నారు. దాంతో పాటు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్), అలాగే రాష్ట్రీయ కెమికల్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) కంపెనీల నుంచి కూడా యూరియా రానుందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఎప్పుడు.. ఎన్ని మెట్రిక్ టన్నులు అనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు.

లెక్కలు సరి చేసుకుంటూ..

యూరియా అధికంగా కేటాయించినా కొరత ఏర్పడటంపై రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులపై సోమవారం జరిగిన 'డీఆర్‌సీ'లో సీరియస్ అయ్యారు. సాగు తక్కువగా ఉన్నా ఎందుకిలా జరిగిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అటు వ్యవసాయ శాఖ, ఇటు మార్క్‌ఫెడ్ అధికారులు, అలాగే హోల్‌సేల్ డీలర్లు, సొసైటీలు, రీటైలర్ల నుంచి పక్కదారి పట్టిన యూరియా లెక్కలను సరి చేసుకునే పనిలో పడినట్లు సమాచారం. ప్రధానంగా యూరియాకు సంబంధించి గత ఖరీఫ్, రబీలో మిగులు ఎంత ఉంది (ఓపెనింగ్ బ్యాలెన్స్), ఈ ఏడాది కేటాయింపులు, కంపెనీల వారీగా నెల వారీ సరఫరా ఎంత, ఇండెంట్ ప్రకారం ఎవరెవరికి ఎంత సరఫరా చేశారు. అందులో ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు ఎంత ఇచ్చారు.. దాన్ని ఎంత మంది రైతులకు పంపిణీ చేశారనే వివరాలు చెప్పడానికి అధికారుల వద్ద కచ్చితమైన గణాంకాలు లేకపోవడం గమనార్హం. కూటమి సర్కారు, వ్యవసాయశాఖ ఉదాసీనత కారణంగా ఈ ఏడాది రైతులను యూరియా సమస్య వేధిస్తోంది. రోడ్డెక్కి నిరసన గళం వినిపిస్తున్నా.. కార్యాలయాలకు తాళాలు వేసి ధర్నాలు చేస్తున్నా స్పందన కరువైంది. అధికారులు చెబుతున్నట్లు వారాంతంలోపు యూరియా సరఫరా కాకుంటే రైతుల నుంచి ప్రతిఘటన తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌కు విశేష స్పందన

అనంతపురం సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) కేవలం రూపాయికే అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్రీడమ్ ప్లాన్‌కు విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ ఉమ్మడి జిల్లా మేనేజర్ షేక్ ముజీబ్ పాషా మంగళవారం తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక ప్లాన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 10 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందారన్నారు. ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాల్స్ వంటి ప్రయోజనాలను సిమ్ యాక్టివేషన్ చేసిన రోజు నుంచి నెల రోజుల పాటు కేవలం రూ.1కే అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

రైలు ఢీకొని గొర్రెల మృతి


చెల్లాచెదురుగా పడిన గొర్రెల కళేబరాలు

కళ్యాణదుర్గం రూరల్: రైలు ఢీకొని 20 గొర్రెలు మృతి చెందిన ఘటన కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గేట్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పట్టాలపై గడ్డి మేస్తున్న సమయంలో బళ్లారి నుంచి కదిరిదేవరపల్లి వైపుగా వెళుతున్న తిరుపతి ప్యాసింజర్ రైలు ఢీకొంది. ప్రమాదంలో 20 గొర్రెలు మృతి చెందడంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు యర్రంపల్లి గ్రామానికి చెందిన కాపరులు ఈరన్న, గుండప్ప వాపోయారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ కత్తితో కోసుకున్నాడు

కళ్యాణదుర్గం రూరల్: అకారణంగా తనను పోలీసులు వేధిస్తున్నారంటూ ఓ యువకుడు కత్తితో చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు.. కంబదూరుకు చెందిన జయమ్మ కుమారుడు ప్రకాష్.. సోమవారం కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి 15 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తాళలేక ప్రకాష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లోనే కత్తితో తన చేతిని కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావమవుతుండడంతో వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. ఘటనపై కంబదూరు ఎస్‌ఐ లోకేష్‌ను వివరణ కోరగా నిందితుడు ప్రకాష్ గతంలో పలు మద్యం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, విచారణ కోసం పీఎస్‌కు పిలిపిస్తే ఇలా ప్రవర్తించాడని పేర్కొన్నారు.

భోజనాలకు అప్పులు.. నిర్వాహకులకు తిప్పలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు అందని బిల్లులు
- గౌరవ వేతనాలు సైతం చెల్లించని సర్కార్
- ఎనిమిది నెలలుగా ఇబ్బందులు

ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో అమలవుతున్న మెనూ

వారం	వంటలు
సోమ	అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
మంగళ	పులిహోర, చట్నీ, ఉడికిన గుడ్డు, రాగిజావ
బుధ	అన్నం, కూరగాయల కూర, గుడ్డు ఫ్రై, చిక్కీ
గురు	వెజ్ పలావ్, బంగాళదుంప కుర్మా, గుడ్డు
శుక్ర	అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
శని	అన్నం, కూరగాయలకూర, స్వీట్ పొంగల్


ఉరవకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఉరవకొండ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు అందక ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి 4 నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఎనిమిది నెలలుగా ఏజెన్సీ నిర్వాహకులు సొంత డబ్బు ఖర్చు పెట్టి విద్యార్థులకు భోజనాలు సిద్ధం చేసి పెడుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటి వరకూ ఒక్కటంటే ఒక్క బిల్లు కూడా చేతికి అందలేదు. కనీసం గౌరవ వేతనం సైతం అందకపోవడంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. పస్తులతో విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే భావనతో ఇంత కాలం అప్పు చేసి భోజనాలు పెడుతూ వచ్చారు. ఇక్పై అప్పు కింద సరుకులు ఇవ్వడం కుదరదని కిరాణా దుకాణదారులు తేల్చి చెప్పడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల తిప్పలు వర్ణనాతీతమయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

అనంతపురం జిల్లాలో 23, శ్రీసత్యసాయి జిల్లాలోని 21 జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి సర్కార్ ఆర్భాటంగా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,220 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తింటున్న వారిలో 80 శాతం మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఉంటున్నారు. ఒక్కో విద్యార్థి భోజనానికి ప్రభుత్వం రూ.9.27 చెల్లించాల్సి ఉంది. అలాగే నిర్వాహకుల గౌరవ వేతనం కింద ఒక్కొక్కరికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంది. అయితే పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా చెల్లించలేదని నిర్వాహకులు వాపోతున్నారు.

అప్పు చేసి పప్పు కూడు

బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించక పోవడంతో అప్పులు చేసి వండి పెట్టాల్సి వస్తోందని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు. కూరగాయలు, పప్పు, నూనె, కిరాణా సరుకులతో పాటు ఇతరత్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాల్సి వస్తోందంటున్నారు. ఎన్నటికైనా ప్రభుత్వం తమ బిల్లులు చెల్లిస్తుందని ఆశతోనే ఇప్పటి వరకూ అప్పులు చేశామని, అయితే ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో ఆశలు కాస్త సన్నగిల్లుతున్నాయన్నారు. ముఖ్యంగా కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో వాటిని కొనుగోలు చేయలేక ఇబ్బంది పడాల్సి వస్తోందంటున్నారు.


ఉరవకొండ బాలికల జూనియర్ కళాశాలలో వంట సిద్ధం చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకురాలు

అప్పుల పాలయ్యాం



ఎనిమిది నెలలుగా ప్రభుత్వం చిల్లి గవ్వ చెల్లించకపోవడంతో అప్పుల పాలయ్యాం. కనీసం గౌరవ వేతనం కూడా ఇంత వరకూ చెల్లించలేదు. పిల్లలు ఇబ్బంది పడకూడదని అప్పులు చేసి వంట సరుకులు సమకూర్చుకుంటున్నాం. ఇకపై అప్పు ఇవ్వడం కుదరదని కిరాణా షాపు నిర్వాహకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– మునేశ్వరి, ఏజెన్సీ నిర్వాహకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉరవకొండ

బడ్జెట్‌కు ఆమోదం దక్కింది

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరి కొన్ని రోజుల్లో ఏజెన్సీలకు బిల్లులతో పాటు గౌరవ వేతనమూ అందిస్తాం.

– వెంకటరమణ, డీవీఈఓ, అనంతపురం

పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: నల్సా వీర్ పరివార్ సహాయత యోజన -2025 కార్యక్రమంలో భాగంగా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ పారా లీగల్ వలంటీర్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న జిల్లాలోని మాజీ సైనికులు, వితంతువులు, వీరనారీలు సెప్టెంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలి. కనీసం డిగ్రీ అర్హత ఉండాలి. పూర్తి వివరాలకు 08554-241146లో సంప్రదించవచ్చు.

డీఎస్సీలో ప్రతిభావంతులకు న్యాయం చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీలో ఎంపికైన ప్రతిభావంతులకు న్యాయం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరు రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ప్రాధాన్యత ఇచ్చిన పోస్టుకు అర్హత సాధిస్తే దానికి మాత్రమే వెళ్లాలనే నిబంధన గుదిబండగా మారిందన్నారు. ఈ నిబంధనను సడలించి వివిధ రకాల పోస్టులకు ఎంపికైన సందర్భంలో అభ్యర్థి ఇష్ట పూర్వకంగా కోరుకునే పోస్టుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపికైన అభ్యర్థులకు ముందస్తుగానే ప్రతి మేనేజ్‌మెంట్‌లోనూ ఖాళీలను ప్రకటించాలన్నారు.

జాతీయ క్విజ్ పోటీలకు తాడిపత్రి విద్యార్థిని


బహుమతి అందుకుంటున్న గౌసియా

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గౌసియా జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఏపీ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సెప్టెంబర్ 7న ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ప్రతిభ చాటిన గౌసియాను కళాశాల అధ్యాపకులు రాజేష్, హరిప్రసాద్, హేమలత, సహ విద్యార్థులు అభినందించారు.

మంట కలిసిన మానవత్వం!

- హిందూ శ్మశాన వాటికలో వదిలేసిన మృతదేహం
- జంతువులు పీక్కుతినడంతో మిగిలిన అస్థిపంజరం
- గుర్తించిన గొర్రెల కాపరులు

కళ్యాణదుర్గం: మానవత్వం మంట కలిసింది. సహజ మరణమో?... లేక హత్యనో? అయిన వారెవ్వరూ లేని అనాథ శవమో? అందరూ ఉన్నా అంత్యక్రియలు చేయకుండా వదిలేసిన మృతదేహమో? వాస్తవం నిర్ధారణ కాలేదు కానీ.. కళ్యాణదుర్గం సమీపంలోని కన్నేపల్లి రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో ఓ మృతదేహం జంతువులకు ఆహారమైంది. మంగళవారం అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు పూర్తిగా కుళ్లిన మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనాథలకు సైతం మానవత్వంతో అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఓ మృతదేహాన్ని ఖననం చేయకుండా శ్మశానంలో వదిలేసి వెళ్లడం ప్రస్తుతం కళ్యాణదుర్గంలో చర్చనీయాంశమైంది.

శవాన్ని పీక్కుతున్న జంతువులు

దాదాపు 50 ఏళ్లకు పైబడిన వ్యక్తి మృతదేహాన్ని ఓ తెల్లని వస్త్రంలో చుట్టి నాలుగైదు రోజుల క్రితం శ్మశాన వాటికలో వదిలేసినట్లుగా అక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. దీంతో ఆ మృతదేహాన్ని జంతువులు పీక్కు తిన్నాయి. దీంతో మృతదేహం పురుషుడిదా? మహిళదా? అనే విషయం తెలియకుండా పోయింది. దుర్వాసన వెదజల్లుతుండడంతో మంగళవారం అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జంతువులు పీక్కు తినడంతో సగానికి పైగా అస్థిపంజరం మిగిలింది.

సహజ మరణమా... లేక హత్యనా?

శ్మశాన వాటికలో లభ్యమైన మృతదేహం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహజ మరణమా? లేక హత్యనా? అనేది తెలియాల్సి ఉంది. సహజ మరణమే అయితే మృతదేహాన్ని ఖననం చేయకుండా ఎందుకు వదిలేశారు అనేది తేలాల్సి ఉంది. ఈ అంశంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా, హిందూ శ్మశాన వాటికలో పడేసిన మృతదేహంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు నిగ్గు తేల్చాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప డిమాండ్ చేశారు. సహజ మరణమా లేక, ఎవరినైనా హతమార్చి అక్కడ పడేశారా అనే అనుమానాలు ఉన్నాయన్నారు.


జంతువులు పీక్కు తినడంతో గుర్తు పట్టలేని విధంగా మారిన మృతదేహం

గిరిజన దంపతులపై రాళ్ల దాడి

గుంతకల్లు: మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన బి.రామ్లానాయక్, లక్ష్మి దంపతులపై దుండగులు రాళ్లతో దాడి చేశారు. వివరాలను బాధితుడు మంగళవారం వెల్లడించాడు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైన రామ్లానాయక్ దంపతులు ద్విచక్ర వాహనంపై గుంతకల్లుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మల్లేనిపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేయడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ గుర్తించి క్షతగాత్రులను గుంతకల్లులోని ఆస్పత్రికి తరలించాడు. రామ్లానాయక్‌కు ఎడమ చేతి భుజం వద్ద ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. కాగా, మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన తుకారం నాయక్ ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అలాగే లాల్ మోతీ నాయక్ ద్విచక్ర వాహనంపై గుంతకల్లు పట్టణ శివారలోని దోనిముక్కల రోడ్డులో వెనుక వైపు నుంచి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులను గిరిజన సంఘం నాయకుడు ఎన్.గోవిందనాయక్, మాజీ సర్పంచ్ వెంకటేష్ నాయక్, గ్రామస్తులు మునినాయక్, లక్ష్మానాయక్, శీనా నాయక్, చిన్నస్వామి నాయక్, నాగరాజు తదితరులు విజ్ఞప్తి చేశారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పక్కాగా చేపట్టాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఈనెల 28 నుంచి చేపట్టనున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా జరగాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని చెప్పారు. డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, యూరియా నిల్వలు, తదితర అంశాలపై కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో నిర్వహించనున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరిశీలన ప్రక్రియకు హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని చెప్పారు.

యూరియా కొరత రాకూడదు..

జిల్లాలో ఎక్కడా యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత నివారించేందుకు వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన జాయింట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రభావంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రైవేటు వ్యాపారులు యూరియా ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే నోటీసు ఇవ్వాలని చెప్పారు. అదే క్రమంగా అధిక ధరకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబరు 2న స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ఇస్తారన్నారు. జిల్లాకు ఎక్కువ సంఖ్య 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డులు వచ్చేలా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని డీపీఓ, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీల్లో ప్రతి రోజూ చెత్త సేకరణ చేపట్ట వివరాలను నమోదు చేయాలన్నారు. నీటి ట్యాంకులు శుభ్రం, క్లోరినేషన్ ప్రక్రియ క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.

అధినేతతో భేటీ


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న విశ్వ

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై అధినేతతో చర్చించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా విష్ణునారాయణ

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి (యాక్టివిటీ)గా శింగనమల నియోజకవర్గానికి చెందిన యరకన్న గారి విష్ణునారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివాహిత ఆత్మహత్య

శెట్టూరు: మండలంలోని పర్లచేడు గ్రామానికి చెందిన వివాహిత గొల్ల శివలింగమ్మ (36) ఆత్మహత్య చేసుకుంది. కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమె సోమవారం పురుగుల మందు తాగింది. విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

మరమ్మతుకు వెళ్లి మృత్యు ఒడికి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- లైన్‌మెన్ నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి భార్య ఫిర్యాదు


చంద్రశేఖర్ మృతదేహం

తనకల్లు: మండలంలోని ఉస్తినిపల్లి సమీపంలో విద్యుదాఘాతంతో చంద్రశేఖర్ (30) అనే యువకుడు మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు తెలిపిన మేరకు... విద్యుత్ శాఖ లైన్‌మెన్ షఫీ వద్ద కొద్ది రోజులుగా మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ (చందు) దిన కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఉస్తినిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మెన్ షఫీ, చంద్రశేఖర్ కలసి వెళ్లారు. పనులు చేసే ముందు లైన్‌మెన్ కొక్కంటి లైనుకు ఎల్‌సీ తీసుకోవాల్సి ఉండగా.. వంకపల్లి లైన్‌కు తీసుకున్నాడు. ఇది తెలియని చంద్రశేఖర్ స్తంభం ఎక్కి విద్యుత్ తీగలను తాకగానే షాక్‌కు గురై స్తంభంపైనే మృతి చెందాడు. లైన్‌మెన్ షఫీ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

సెప్టెంబర్ నుంచి గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాలు

- మేలుజాతి పశుసంతతి లక్ష్యంగా పశువులకు ఉచితంగా ఎద సూదులు
- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ జి.వెంకటేష్

అనంతపురం అగ్రికల్చర్: మేలు జాతి పశుసంతతి పెంపే లక్ష్యంగా జిల్లాలో పశువులకు ఉచితంగా లింగ నిర్ధారణ వీర్యం (సెక్స్ సార్టెడ్ సెమన్-ఎస్ఎస్ఎస్) ద్వారా గర్భధారణ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డిస్ట్రిక్ లైవ్‌స్టాక్ ఏజెన్సీ-డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. రాష్ట్రంలో అనంతపురం జిల్లాతో పాటు కుప్పం డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ నుంచి ఈ కార్యాచరణ మొదలు కానుందన్నారు. సెప్టెంబర్‌లో అనంతపురం డివిజన్, అక్టోబర్‌లో ఉరవకొండ డివిజన్, నవంబర్‌లో ధర్మవరం డివిజన్, డిసెంబర్‌లో పెనుకొండ, హిందూపురం డివిజన్లలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరాలతో పాటు ప్రతి డివిజన్‌లో 8 ప్రాంతాల్లో దూడల ప్రదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. కనీసం 40 నుంచి 50 లేగదూడలను సమీకరించి ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. మంచి ఆరోగ్యవంతమైన దూడలను పెంచిన లబ్ధిదారులకు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తామన్నారు. కాగా, రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) కార్యక్రమంలో భాగంగా రాయలసీమ గ్రామీణ పశుయోజన కింద ఉచితంగా పశువులకు ఉచితంగా ఎస్ఎస్ఎస్ ద్వారా కృత్రియ గర్భోత్పత్తి (ఎద సూదులు) వేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రతి పశువుకు రూ.500 వసూలు చేసేవారన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకు అవకాశం ఇవ్వడంతో ఉచితంగా ఎద సూదులు వేస్తారన్నారు. దీని వల్ల 90 శాతం వరకు ఆడదూడలు (ఫిమేల్) జన్మిస్తాయన్నారు. ఇప్పటికే అన్ని వెటర్నరీ ఆసుపత్రులకు లింగనిర్ధారణ వీర్యాన్ని సరఫరా చేశామన్నారు. రైతులు, పాడి లబ్ధిదారులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా దీని ద్వారా తమ పశువులకు గర్భధారణ చేయించుకోవాలని సూచించారు. పశుసంపద అధికంగా ఉన్న గ్రామాన్ని గుర్తించి మండలానికి ఒక శిబిరం ఏర్పాటు చేయాలని షెడ్యూల్ తయారు చేశామన్నారు.

దేశంలోనే అరుదైన గణనాథుడు

దేశంలో ఎక్కడా లేని విధంగా దశభుజాలతో భారీ విగ్రహ రూపంలో ఉన్న వినాయకుడు రాయదుర్గంలో వెలిశాడు. 14వ శతాబ్దంలో భూపతిరాయలు హయాంలో వెలసిన ఈ ఆలయంలో వినాయకుడు కుడి వైపు తొండంతో పూర్ణ ఫలంతో దర్శనమిస్తుంటాడు. తన తండ్రి అయిన పరమ శివుని వలె మూడు కన్నులు (త్రినేత్రం), తన తల్లి మహాశక్తి పార్వతీ దేవి వలె పది చేతులు కలిగి ఉంటాడు. కుడివైపున.. మొదటి చేతిలో నారికేళం, రెండో చేతిలో చక్రం, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో ధనుస్సు, ఐదో చేతిలో అంకుశం ఉంటాయి. అలాగే ఎడమవైపున.. మొదటి చేతిలో భార్య సిద్ధిని ఆలింగనం చేసుకున్నట్టు, రెండో చేతిలో శంఖం, మూడో చేతిలో పవిత్రం, నాలుగో చేతిలో శరం, అయిదో చేతిలో ఖడ్గం దర్శనమిస్తాయి. కుడివైపున సూర్యుడు, ఎడమవైపున చంద్రుడు ఉండటంతో.. విశ్వగణపతిగా కీర్తిస్తుంటారు. విగ్రహం ఎడమ అరికాలి కింద అష్టదళ పద్మం ఉంది. కాళ్లకు గజ్జెలూ, కాలికింద మూషిక వాహనం ఉంటాయి. మొత్తం మీద ఇక్కడ స్వామి వారు మహా చిద్విలాసంగా కనిపిస్తాడు. పది చేతులవాడు కావడంతో దశభుజ గణపతిగా పిలుస్తారు. ఆది, మంగళవారాల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి.

సమ్‌థింగ్ Special

– రాయదుర్గం టౌన్:


రాయదుర్గంలో వెలసిన దశభుజ గణపతి నిజరూప దర్శనం

క్లుప్తంగా

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

ఆత్మకూరు: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ లక్ష్మణ రావు నిర్వాహకులకు సూచించారు. మంగళ వారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లా డుతూ మండపాల దగ్గర తప్పనిసరిగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేడుకల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించినా, అసాం ఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడనా గొడవలు జరిగినా, ప్రమాదాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏఎస్‌ఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజే నిమజ్జనం చేయాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పీఎస్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహా లన్నీ మూడు రోజే నిమజ్జనం చేయాలని రూరల్ పీఎస్ సీఐ శేఖర్ సూచించారు. రూరల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహాల మంటపాల నిర్వాహకులతో మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రమ్స్, డీజేలు పెట్టరాద న్నారు. టపాకాయలు కాల్చవద్దన్నారు. అగ్ని మాపక శాఖ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్

అనంతపురం అర్బన్: ప్రభుత్వాలు సేల్స్ రెప్ర జెంటేటివ్‌ల సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్‌ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లా డుతూ మెడికల్ రెప్రజెంటేటివ్‌లకు మాత్రమే పరిమితమైన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం(ఎస్‌పీఈ యాక్ట్–1976) పునరిద్ధరించా లన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను పునరుద్ధిం చాలని డిమాండ్ చేశారు. మెడికల్ రెప్స్‌కు నిర్దిష్టమైన పని విధానం అమలు చేయాల న్నారు. గతంలో ఉన్న ట్రిబ్యునల్‌ను కొనసా గించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడికల్ రెప్స్ పనిచేసేందుకు అనుమతించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్‌కు విన తిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మనోహర్, విశ్వనాథ్, అంజి, విజయ్, నరేంద్ర పాల్గొన్నారు.

పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు



రాప్తాడు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

రాప్తాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధి కారులను ఆదేశించారు. ఆయన మంగళవారం రాప్తాడు మండల కేంద్రంలో గంగలకుంట గ్రామ క్రాస్, ఆటో నగర్ సమీపంలోని స్థలా లను పరిశీలించారు. వచ్చే నెలలో సీఎం చం ద్రబాబు పర్యటన ఉంటుందని తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, జేసీ శివనారాయణ శర్మ, ఆర్డీఓ కేశవ నాయుడు, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంక టేసులు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



మహిళకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

ఆత్మకూరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ తెలియజేశారు. మంగళవారం పంప నూరు గ్రామంలో పంచాయతీ సిబ్బందితో కలసి పర్యటించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ, చెత్త సేక రణపై స్థానిక మహిళలు అడిగి తెలుసు కున్నారు. మహిళలకు ప్లాస్టిక్ నిషేధంపై అవ గాహన కల్పించారు. అనంతరం సచివాల యాన్ని తనిఖీ చేశారు. సమయపాలన పాటిం చాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సిబ్బందికి సూచిం చారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, పంచాయతీ సెక్రటరీ శిరీష తదితరులు ఉన్నారు.



పండుగ అంటే అంతే మరి: పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న పాతూరు మార్కెట్ ప్రాంతం



ప్రతిమను కొందాం... పండుగ చేద్దాం: వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న మహిళలు



వేడుకలకు వేళాయె : గణపతి ప్రతిమలను తీసుకెళ్తున్న దృశ్యం

వినాయక శోభ

అనంతపురం కల్చరల్ : నగరం వినాయక చవితి వేడుకలతో నూతన శోభను సంతరించు కుంది. మంగళవారం ఉదయం నుండి సాయం త్రం వరకు పూజాసామగ్రి, వినాయకుల ప్రతి మల కొనుగోళ్లతో నగరంలోని పాతూరు, రామనగర్, టవర్‌క్లాక్ పరిసరాలు కిట కిటలాడాయి. ఇదిలా ఉండగా చవితి వేడుక లకు సప్తగిరి సర్కిల్ వద్ద విద్యుద్దీపకాంతులతో భారీ దేవతారూపాల సెట్టింగులతో సుందరం గా ముస్తాబైంది. ఇక్కడ కర్ణాటకలోని ప్రసిద్ధ క్షేత్రమైన కారణగిరి వినాయకుడి ప్రాశస్త్యం తెలిపే విధంగా సీతాన్వేషణ వృత్తాంతాన్ని కద లికలతో ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీలోని అక్షర ధామ్ నమూనాతో ఏర్పాటు చేసిన గోపురం విశేషంగా ఆకట్టుకుంటోంది. అలాగే నగరంలో పలు చోట్ల కదలిక వినాయకుల ఆకారాలు వివిధ పుణ్యక్షేత్రాల వృత్తాంతాలను ప్రదర్శించ డానికి సిద్ధమయ్యాయి.



గణపయ్యా... మా ఇంటికి రావయ్యా: కొనుగోలు చేసిన వినాయక ప్రతిమతో చిన్నారి



ఎత్తర ఎత్తు: వినాయక ప్రతిమను ఆటోలోకి ఎక్కిస్తున్న దృశ్యం



వేడుకలు అదిరిపోవాల: వినాయక ప్రతిమను తరలిస్తూ కేరింతలు కొడుతున్న యువకులు



వ్యాపారం జోరు : పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

ఘనంగా వీరభద్రస్వామి జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: వీరభద్ర సేవా సమితి ఆధ్వ ర్యంలో వీరభద్రస్వామి జయంతి వేడుకలు మంగళ వారం ఘనంగా జరిగాయి. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని స్వామివారి ఆలయంలో వేదమం త్రాలు, మంగళవాయిద్యాల నడుమ విశేష పూజో త్సవాలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహిం చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగిం ది. అంతకు ముందు వేదపండితులు వీరభద్ర స్వామి అవతార విశిష్టతను తెలియజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పవన్, రొళ్ల శ్రీనివాస్, బాలాజీ, రఘు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం సెంట్రల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమణకుమార్ పేర్కొన్నారు. జూని యర్ కళాశాలలో గత పది రోజులుగా నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. బాల్ బ్యాడ్మింటన్ అసోషియే షన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్‌మోదిన్, జిల్లా సెక్రటరీ వెంకటేసులు, సీనియర్ క్రీడాకారులు విజయ్‌కు మార్, బాషా, రియాజుద్దీన్, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత గణపతులనే పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న అనంత చంద్రారెడ్డి



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న జడ్జి సత్యవాణి, న్యాయవాదులు

అనంతపురం కల్చరల్: పర్యావరణ హిత గణపతు లనే పూజిద్దామని వైఎస్సార్‌సీపీ నేత అనంత చం ద్రారెడ్డి నగర ప్రజలకు సూచించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత అనిల్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో మొదటిరోడ్డులో అనంత చంద్రారెడ్డి, ఓబిరెడ్డి, పెన్నోబలేసు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సుజాతా రెడ్డి, కేఎల్ దేవి, పార్వతి, నరేంద్రరెడ్డి, రవిశేఖరరెడ్డి, మహేష్, భాస్కర్ వందలాది విగ్రహాలను పంపిణీ చేశారు. ఆదరణ సేవాసమాజ్ లాల్‌బాషా నేతృత్వం లో పలు చోట్ల మట్టి వినాయకులను అందజేశారు.

అనంతపురం కల్చరల్: పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతులనే పూజిద్దామని మేయర్ వసీం అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శనగర్‌లో కోనా రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణ పతుల పంపిణీ కార్యక్రమానికి మేయర్ మహ్మద్ వసీం, అనంత చంద్రారెడ్డి , కార్పొరేటర్ కమల్‌భూ షణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నీటిలో సులభంగా కరి గిపోయే మట్టి గణపతులనే అందరూ వాడాలని సూచించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ జడ్పీ చైర్మన్ బోయగిరిజమ్మకు మట్టి గణపతిని అం దించారు.

అనంతపురం టవర్‌క్లాక్: పర్యావరణాన్ని కాపాడుకు నేందుకు మట్టి వినాయకులను పూజించుకోవాలని నగరపాలక కమిషనర్ బాలస్వామి అన్నారు. మంగ ళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వ ర్యంలో మట్టి వినాయక బొమ్మలను ఉచితంగా పం పిణీ చేశారు. జర్నలిస్టులు అజాద్, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, కుళ్లాయప్ప, హరి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్, జర్నలిస్టులు

రాప్తాడు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి అన్నారు. చిన్మయనగర్‌లో జేఎ న్‌టీయూ మెయిన్ రోడ్డు వద్ద మంగళవారం వర్దిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేతిరెడ్డి పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం సెంట్రల్: అడ్వొకేట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడే హనుమన్న ఆధ్వర్యంలో మంగళవారం బార్ అసోసియేషన్ నూతన భవనంలో మట్టి వినా యకులను పంపిణీ చేశారు. మొదటి అదనపు జిల్లా జడ్జి సత్యవాణి, బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బాల కోటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్వొకేట్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు బాలాజీనా యక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో శామ్యూల్ ప్రతిభ

అనంతపురం సెంట్రల్: యూఏఈలోని అబుదా బిలో ఈనెల 15 నుంచి 24 వరకూ జరిగిన అంతర్జా తీయ చెస్ పోటీల్లో జిల్లా చెస్ క్రీడాకారుడు మాస్టర్ శామ్యూల్ స్టీఫెన్ అగ్రస్థానంలో నిలిచారు. 40 దేశాల నుంచి 320 క్రీడాకారులు పాల్గొని ఇండియా నుంచి 13 సంవత్సరాల శామ్యూల్ 9 రౌండ్లలో 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సంద ర్భంగా బంగారు పథకం, మెమొంటోతో పాటు రూ. 2,000 యూఎస్ డాలర్లు ప్రైజ్ మనీ సొంతం చేసుకున్నాడు.

జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు వినాయక చిత్రం

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, చిత్రకారుడు చింతా వేంకటే శ్వర్లు కుంచె నుంచి జాలువారిన వినాయకుడి చిత్రం జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. వినాయక చవితి పర్వదినం సందర్భంగా విల క్షణ చిత్రాలను విజయవాడ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శి స్తున్నారు. ఇందులో భాగంగా మహాశివుడు, జగ న్మాత పార్వతీదేవితో కలిసి భూలోకానికి వచ్చే వినాయకుడి చిత్రంలో వివిధ దేవతామూర్తులు కొలువుదీరేలా చిత్రించి ఆకర్షణగా మార్చారు. జ్ఞానానికి ప్రతీకలైన విఘ్నేశ్వరుడి చెవుల్లో నారద తుంబురులు వేదం చదువుతుండడం, శివుడి తలపై గంగా మాతకు ప్రత్యేక రూపమివ్వడం, పాలకడలిలో శేషపాన్పుపై పవళించిన శ్రీమహా విష్ణువు, లక్ష్మీదేవి ఇలా ఆసక్తికరంగా చిత్రలేఖన ప్రతిభ సాగింది. చక్కటి చిత్రాన్ని గీచి అనంత ప్రతిభను చాటిన చింతా వేంకటేశ్వర్లును అనం త కళాకారులు, రచయితలు అభినందించారు.



జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కు ఎంపికైన చిత్రం

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

చెన్నేకొత్తపల్లి: మండలంలో రైతులకు అందా ల్సిన ఎరువులకు డీలర్, దుకాణదారుడు కాని కృ త్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ శ్రీధర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఏఓ మురళీ, ఎస్‌ఐ సత్యనారాయణతో కలసి తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా దుకాణాల్లో స్టాక్,ఇతర రికార్డులు పరి శీలించారు. ఎరువులు కొనిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం బ్యాన్ చేసిన మందులు విక్రయించ రాదన్నారు.

నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే అలాంటి దుకాణదారుడిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గోదాములో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు.

జాతీయ స్థాయి పోటీలకు 'అనంత' పద్యనాటకం

అనంతపురం కల్చరల్: కళల కాణాచి జాతీయ స్థాయి పంచమ పద్య నాటక పోటీలకు అనంత కళాకారుల నాటకం ప్రాథమిక పరిశీలనకు ఎంపికైంది. వీణా అవార్డు –25 గాను వివిధ జిల్లాల నుంచి ప్రతిష్ఠాత్మక కళాకారులు పోటీ పడ్డారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన కల్లూరు సుబ్బారావు లలితకళా పరిషత్తు తరపున సీనియర్ నటుడు రామగోవిందసాగర్ దర్శకత్వంలో రూపొందిన 'కాలభైరవ సంహారం' నాటకం ఎంపిక చేశారు. మరోసారి తుది ఎంపిక వచ్చేనెల 27న తెనాలిలో జరగనుంది. జిల్లాలో తొలిసారి కాలభైరవ సంహారం పద్య నాటకానికి శ్రీకారం చుట్టిన ఎల్కేపి కళాకారులు తొలి దశలో రూ. 50 వేలు స్థాయికి చేరుకున్నారని తుది విడతలోనూ అదే ప్రతిభను కనపరచి ప్రథమ స్థానాన్ని దక్కించుకుంటారని లలిత కళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ పేర్కొన్నారు. కర్ణుడిగా రామగోవిందసాగర్, కాలభైరవుడిగా దయానంద అసమాన నటనను ప్రదర్శించారని కొనియాడారు.

ఆదర్శ నగర్‌లో చోరీ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ పీఎస్ పరిధిలోని ఆదర్శ నగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు... కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన బాబు సుమారు 18 ఏళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి ఆదర్శ నగర్‌లో ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం కుటుంబ సభ్యు లతో కలసి రామగిరికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని గమనించిన దుండగులు సోమవారం అర్ధరాత్రి సమయంలో లోపలకు చొరబడి బీరు వాను ధ్వంసం చేసి, అందులోని బంగారు, డబ్బును అపహరించారు. ఆ సమయంలో ఇంట్లో నుంచి పెద్దపెద్ద శబ్ధాలు రావడాన్ని గుర్తించిన చుట్టుప క్కల వారు గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న బాబు కుటుంబం మంగళవారం ఉదయం ఇం టికి చేరుకుని ఘటనపై ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆప్షన్ మార్చుకునే అవకాశం ఇవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీలో వివిధ సబ్జెక్టులకు అర్హత సాధించిన అభ్య ర్థులకు పోస్టులను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని మాదిగ ఉద్యో గుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శం కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డికి ఆన్‌లైన్‌లో వినతి పత్రాలు పంపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే సమయంలో ఖాళీలు ఎక్కువగా ఉన్న ఎస్జీటీ పోస్టుకు తొలి ప్రాధాన్యత ఇచ్చుకున్నారన్నారు. ఐతే చాలామంది తొలి ప్రాధాన్యత ఇచ్చిన ఎస్జీటీ పోస్టుతో పాటు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు కూడా అర్హత సాధించారన్నారు. ఇలాంటి ప్రతిభా వంతులకు సర్టిఫికెట్ వెరిఫి కేషన్ సమయంలో తప్పకుండా పోస్టు ఎంపిక చేసుకునే అవకాశాన్ని ఇచ్చి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'మినర్వా'లో వినాయక వేడుకలు



వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ముందస్తుగా వినాయక చవితి వేడుకలను ఘనం గా జరుపుకొన్నారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గొర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాబుద్ధులు ప్రసాదించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించాలన్నారు. అనంతరం చిన్నారుల చిట్టిచేతులతో బొజ్జ గణపయ్యలను అందంగా రూపొందించారు. చివరగా విద్యార్థులు విఘ్నేశ్వరుడి భక్తిపాటలను పాడి అలరించారు.